క్లుప్తంగా

శ్మశానానికి స్థలం కేటాయింపు



స్థలాన్ని చదును చేయిస్తున్న సర్పంచ్ శశికుమారి, నాయకులు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె దళితవాడకు అధికారులు శ్మశాన స్థలాన్ని కేటాయించారు. గ్రామానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఎకరా స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పరిచారు. పెరుమాళ్లపల్లె సర్పంచ్ శశికుమారి ఆధ్వర్యంలో శనివారం ఈ స్థలాన్ని జేసీబీతో చదును చేయిస్తున్నారు. రాళ్లు, ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేయిస్తున్నారు. దశాబ్దాలు తమ సమస్యను ఎవరూ పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు శ్మశానాన్ని కేటాయించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షణ్ముగరెడ్డి, పరందామరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.విద్యావతి తెలిపారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపరిస్తే దోమల బెడద ఉండదని, తద్వారా రోగాలను దూరం చేయవచ్చని తెలిపారు. కాలువల్లో మలాథిన్ స్ప్రే చేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు నరేష్, సుధ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శ్రీరంగరాజపురం: మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. శనివారం ఎంపీడీవో మాట్లాడుతూ వెలుగు కార్యాలయంలో ఎంపీపీ సరిత ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు సమాశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. ప్రజాప్రతి నిధులు తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం 6.30 నుంచి 8.15 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై, గరుడాళ్వార్, చక్రతాళ్వార్ తిరుమాడవీధుల్లో విహరిస్తూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తదుపరి ఉదయం 8.40 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నంలో అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగ హోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి సమక్షంలో గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

యువకుడికి గాయాలు

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని ఐతేపల్లి సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు రూరల్ కొంగారెడ్డిపల్లికి చెందిన హరికృష్ణ వ్యక్తిగత పనులు ముగించుకుని శనివారం ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు పయనమయ్యాడు. ఐతేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. హరికృష్ణకు కుడికాలికి తీవ్ర గాయమైంది. అతన్ని స్థానికులు 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అజరామరుడు ఘంటసాల

తిరుపతి కల్చరల్ : గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అజరామరుడని తిరు పతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా తిరుపతి ఫిలిం సొసైటీ సభ్యులు స్థానిక ఘంటశాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత శ్రీవారి గీతాలను ఆలపించిన ఘనత ఘంటసాలకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక గాయకులు సోము ఉమాపతిని సన్మానించారు.

మొదలైన ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

- రాజకీయ పార్టీల బ్యానర్ల తొలగింపు
- నాయకుల విగ్రహాలకు ముసుగులు
- ఓటర్ల జాబితా ప్రకటించిన అధికారులు





బైపాస్ రోడ్డు కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి తొడిగిన ముసుగు, తొలగించి తీసుకెళ్తున్న ఫ్లెక్సీలు

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల నగరా మోగడం.. ఈనెల 16వ తేదీన నోటిఫికేషన్ జారీ కానుండడంతో నియోజకవర్గంలో ఎన్నికల వేడి మొదలైంది. రాష్ట్ర శాసన మండలికి సంబంధిత పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధిత నియోకవర్గ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఐదుగురు సిట్టింగ్ ఎమ్మెల్సీలకు వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో పదవీకాలం ముగియనుండడంతో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అర్హులు ఓటు నమోదు చేసుకున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 9 పోలింగ్ స్టేషన్లు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 5 పోలింగ్ స్టేషన్లు కేటాయించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శనివారం నియోజకవర్గ పరిధిలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫెక్సీలను అధికారులు తొలగించారు. పలు కూడళ్ల వద్దగల రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

మండలం	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
నగరి	2625	3
పుత్తూరు	2838	3
విజయపురం	770	1
నింద్ర	657	1
వడమాలపేట	824	1
మొత్తం	7714	9

టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

మండలం	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
నగరి	196	1
పుత్తూరు	305	1
విజయపురం	26	1
నింద్ర	40	1
వడమాలపేట	63	1
మొత్తం	630	5

అర్హులైనవారు ఓటరుగా నమోదు కావచ్చు



షెడ్యూలు వచ్చిన రోజు నుంచే ఎన్నికల నియమావళి అమలులో ఉంటుంది. రాజకీయ పార్టీ నాయకులు దానికి అనుగుణంగా నడుచుకోవాలి. ప్రశాంత వాతావరణం ఎన్నికలు నిర్వహిస్తాం. అర్హత ఉండి ఇంకా ఓటు నమోదు చేసుకోని వారికి ఈ నెల 13వ తేదీ వరకు అవకాశం ఉంది. వారు ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చు.

–చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి, నగరి

హైస్కూల్‌కు అదనంగా 12 గదులు



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆర్కే రోజా

నగరి: మున్సిపల్ పరిధి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విస్తరణకు సిద్ధం చేసిన స్థలాన్ని మంత్రి ఆర్కేరోజా శనివారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేకపోవడాన్ని మంత్రి గుర్తించారు. అదనంగా 12 గదుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.1.44 కోట్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో రూ.20 లక్షల నిధులు విడుదలయ్యాయి. పాఠశాల విస్తరణకు తగువైన స్థలాన్ని గుర్తించి సర్వే ప్రక్రియ పూర్తిచేశారు. స్థలం చదును చేసే పనులు కూడా జరుగుతున్నాయి. ఆ పనులను మంత్రి ఆర్కే రోజా శనివారం పరిశీలించారు. నిర్మాణం ఎక్కడి నుంచి ఎక్కడివరకు ఉంటుంది, ప్రస్తుత పాఠశాలకు అనుబంధంగా అది ఎలా ఉపయోగపడుతుంది అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు మోహన్‌రాజ్, భూపాలన్, నాయకులు బీకే రమేష్, రమేష్‌బాబు, స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ హరి కుటుంబానికి మంత్రి రోజా పరామర్శ

పుత్తూరు రూరల్: మున్సిపల్ చైర్మన్ ఏ.హరిని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఇటీవల చైర్మన్ తల్లి ఆనంగి మునెమ్మ మృతి చెందారు. శనివారం పట్టణంలోని హరి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను రోజా పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పెద్దను కోల్పోయినప్పుడు మనోధైర్యంతో ఉండాలని ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఓదార్పు

నింద్ర: వైఎస్సార్ సీపీ నింద్ర పంచాయతీ నాయకురాలు వసంత కుటుంబ సభ్యులను మంత్రి రోజా పరామర్శించారు. నాలుగు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో వసంత మృతి చెందిన విషయం తెలిసిందే. అదే విధంగా గ్రామంలో ఇటీవల మృతిచెందిన మణికంఠన్ కుటుంబ సభ్యులను, సచివాలయ వలంటీరు చార్లి చెల్లెలు, గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన భాను కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ఓదార్పు చెప్పారు.

వైభవంగా ప్రసన్నుడి ఊరేగింపు



స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

వడమాలపేట: మండల పరిధిలోని అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం మాఘ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పరిమళభరిత పుష్ప మాలికలతో అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవ నిర్వహించారు. వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఉయలలో స్వామివారు సేదతీరారు. అనంతరం శ్రీపద్మావతి, ఆండాల్ సమేతంగా సర్వాలంకారభూషితుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళ వాయిద్యాలు నడుమ తిరుమాడ వీధులల్లో ఊరేగించారు. భక్తుల నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఊరేగింపు ఆలయానికి చేరుకున్న అనంతరం ఏకాంత సేవ నిర్వహించారు. ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని నాగూరుపల్లెలో శనివారం వ్యాధి నిరోధక టీకాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే13 రకాల వ్యాధుల నివారణకు టీకా తప్పనిసరని పేర్కొన్నారు. టీబీ, పోలియో, కామెర్లు, డిఫ్తీరియా, కంఠసర్పి, ధనుర్వాతం, నిమోనియా, పీసీవీ, విరేచనా లు, ఆటలమ్మ, రుబెల్లా, మెదడు వాపు, కంటివ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. క్యాలెండర్ ప్రకారం పీహెచ్‌సీల్లో ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఆరు నెలల తరువాత ఆహారాన్ని మెత్తగా చేసి తినిపించాలని సూచించారు. అంగన్‌వాడీల్లో ఇచ్చే బాలమృతాన్ని ఇవ్వాలన్నారు. సీహెచ్ఓ మోహనకుమారి, జయంతి పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గంగాధరనెల్లూరు: కొట్రకోన గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. రెండవ యాగశాలపూజ, హోమం, అష్టాదశ పూజలు చేశారు. అనంతరంనేత్రదర్శనం కల్పించారు. వివాహం కాని వారు కన్యపూజ చేపట్టారు. సుమంగళిపూజ, దంపతుల పూజ చేశారు. గోపూజ చేసి ఆఖరుగా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూల హారాలతో అలంకరించారు. ఆదివారం వేకువ జామున విమాన కుంభాభిషేకం, మూలస్థాన కుంభాభిషేకం, మహాకుంభాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, ప్రధాన కార్యదర్శి యుగంధరాచారి, గౌరవాధ్యక్షురాలు సుభాషిణి తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రోజా ట్రస్టు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

నగరి: విజయపురం మండలం మహారాజపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివకుమార్‌కు రోజా చారిటబుల్ ద్వారా మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. శివకుమార్ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. శనివారం రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ రఫీ

కార్వేటినగరం: వైస్సార్‌సీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ రఫీని నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించేందుకు సహకరించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మకు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతాయుతంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సోషియల్ మీడియా కమిటీ నియామకం

వడమాలపేట: వైఎస్సార్ సీపీ మండల సోషల్ మీడియా కమిటీని ప్రకటించారు. నియోజక వర్గ సోషియల్ మీడియా కన్వీనర్‌గా పూడి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని ఇదివరకే ప్రకటించారు.

శనివారం మండల కమిటీ సభ్యులుగా వడమాలపేట గాండ్ల వీధికి చెందిన కళత్తూరు జగదీష్, కాయంపేట గ్రామానికి చెందిన దినేష్, కల్లూరు గ్రామానికి చెందిన కిరణ్, బుట్టిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన పవన్‌కుమార్, పాదిరేడు గ్రామానికి చెందిన సదర్శన్‌ను నియమించినట్లు నియోజక వర్గ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమకు పదవి వచ్చేలా సహకరించిన మంత్రి ఆర్కే రోజాకు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి బాధ్యతాయుతంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

పల్లికొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లెలోని శ్రీశ్రీమంగళాదేవి సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు వైభవోపేతంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఆలయ అర్చకుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పూర్ణాహుతి చేపట్టి ధ్వజ చిత్ర పటాన్ని ధ్వజస్తంభం పైకి అధిష్ఠింపజేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహాదీపారాధన, ఐదు గంటలకు యాగ శాల పూజ, సాయంత్రం మూలవర్లను అభిషేకించిన అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పల్లకీపై అధిష్ఠింపజేసి విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామి,అమ్మవార్లు పల్లకీలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. మొదటి రోజు ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, అతని కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, బోర్డు సభ్యులు ఎస్ఎం సురేష్, అజయ్‌కుమార్, కవిత, మంజుల, ఆనందుడు, చిత్ర, సత్య, మునివేలు, ప్రత్యేక ఆహ్వానితులు రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో 811 కేసుల పరిష్కారం



పుత్తూరులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి రాఘవేంద్ర



నగరిలో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి విష్ణుశర్మ

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక అదాలత్‌లో 811 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.2,60,43,349 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 731 క్రిమినల్ కేసులు, 53 సివిల్, 27 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా న్యాయమూర్తులు రాఘవేంద్ర, లీలాశ్యామసుందరి, గోపాలకృష్ణ వ్యవహరించారు. బెంచ్ మెంబర్స్‌గా న్యాయవాదులు మురగేశన్‌రెడ్డి, మురళీ, పురుషోత్తం వ్యవహరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులుపాల్గొన్నారు.

నగరిలో

నగరి: పట్టణంలోని జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 181 కేసులు పరిష్కరించారు. రూ. 44,87,883 రికవరీ చేసినట్లు జూనియర్ సివిల్ జడ్జి విష్ణుశర్మ తెలిపారు. సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, పోలీసులు పాల్గొన్నారు.

శ్మశాన కొల్లను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్: శివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన జరిగే శ్మశానకొల్ల(మయానసేవ)ను విజయవంతం చేయాలని అంకాళపరమేశ్వరి ఆలయాభివృద్ధి ట్రస్టు నిర్వాహకులు కుమార్ పిలుపునిచ్చారు. చిత్తూరు, గురప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో శనివారం ఆ నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఆలయంలో శివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీన శ్మశానకొల్లను ఘనంగా నిర్వహిస్తామన్నారు. భూత వాహనంపై అమ్మవారు ఊరేగుతూ నీవానదికి చేరుకుంటారన్నారు. అక్కడ అమ్మవారికి విశేష పూజలు చేస్తామని చెప్పారు. అనంతరం నగర వీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. తదనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. అర్చకులు కుమార్, మయానసేవ ఉత్సవ కమిటీ సభ్యులు సురేష్, వినోద్, అరుల్ కుమార్, ముత్తు, వేలాయుధం, పెరుమాళ్, వేలుస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రోశయ్య

పుత్తూరు రూరల్: రాజకీయ పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని పాటించాలని తహసీల్దార్ రోశయ్య స్పష్టం చేశారు. తూర్పు రాయలసీమ (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల నియమావళిపై అన్ని రాజకీయ పార్టీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 13న ఎన్నికలు, 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో టీడీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్‌రాజు

పాలసముద్రం: అటవీ సంరక్షణ అందరి బాధ్యతని, అడవికి నిప్పు పెడితే రూ.25 వేల జరిమానా, మూడు నెలల జైలు శిక్ష తప్పదని చిత్తూరు తూర్పు విభాగ అటవీ శాఖ అధికారి థామస్‌కుమార్, తెలిపారు. శనివారం వన చైతన్య పథంలో భాగంగా సిబ్బందితో కలసి అటవీ సమీప ప్రాంతంలోని వనదుర్గాపురం, రామలింగాపురం, శ్రీకావేరిరాజుపురం, ఆముదాల, తిరుమలరాజుపురం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్‌కుమార్ మాట్లాడుతూ అడవులను కాపాడుకోవాలని తెలిపారు. ఎవరైనా అడవికి నిప్పు పెడితే 9440810288 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. నాయకులు చంద్రశేఖర్‌రాజు, గోవిందరాజు, వరదరాజు, సిబ్బంది సతీష్, లోకేష్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, రైతులు

పాలసముద్రం: సేంద్రియ వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ ప్రకృతి సాగులో నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని తెలిపారు. మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని పేర్కొన్నారు. తెగుళ్ల నివారణకు కషాయాలను పిచికారీ చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన చెరుకు నుంచి తయారు చేసిన బెల్లంను తిరుమలతిరుపతి దేవస్థానం మార్కెట్ ధరకన్నా రూ.5 ఎక్కువకు కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.